
ప్రజాశక్తి

సోమవారం 16 అక్టోబర్ 2023

5

విజయనగరం



20 నుంచి రాష్ట్ర స్థాయి చెస్ ఛాంపియన్ షిప్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అండర్ 13 రాష్ట్ర స్థాయి చెస్ ఛాంపియన్ షిప్ పోటీలు ఈనెల 20 నుంచి 23 వరకు విజయనగరంలో జరుగుతాయని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బిఎరావు, కెవి జ్వాలాముఖి, టోర్నమెంట్ నిర్వాహకులు లార్వెన్స్ స్కూల్ డైరెక్టర్ రవి మండా తెలిపారు. లార్వెన్స్ స్కూల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు రాష్ట్ర పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలు నాలుగు రోజులు పాటు లార్వెన్సు స్కూలులో జరుగుతాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 250 నుంచి 300 మంది క్రీడాకారులు హాజరు కానున్నారని తెలిపారు. క్రీడాకారులకు, వారితో వచ్చే తల్లి తండ్రులకు భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. విజేతలకు హైదరాబాద్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. పోటీలను విజయవంతం చేసేందుకు క్రీడాకారులు, క్రీడాసంఘాలు, ప్రజలు సహకరించాలని కోరారు.



ఎండిపోయిన మొక్కజొన్న చేను

మొక్కజొన్న రైతు కన్నీరు

ఎన్నో ఆర్థిక ఇబ్బందులు పడి.. ఎంతో ఆశతో మొక్కజొన్న పంటపై మదుపులు పెట్టి, రాత్రనకా పగలనకా కష్టపడి పండించిన రైతులకు కన్నీరే మిగిలింది.ఈ ఏడాది ఖరీఫ్ లో వేసిన మొక్కజొన్న ఓవైపు వర్షాభావం, మరోవైపు కత్తెరపురుగుతో పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. పండిన కొద్దిపాటి పంటకు కూడా దళారులు దందాతో గిట్టుబాటు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అప్పులు చేసి పంటపై పెట్టిన మదుపులు అయినా రావని తెలుసుకున్న రైతులు దిక్కుతోచని స్థితిలో కన్నీరు పెడుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



ఎన్నులకు గింజలు కట్టలేదని చూపిస్తున్న ఓ రైతు

- భారీగా తగ్గిన పంట దిగుబడి
- ఎకరాకు 5 క్వింటాళ్లు రావడం కష్టమే
- వర్షాభావం.. కత్తెర పురుగే కారణం
- దోచుకుంటున్న దళారులు

ప్రజాశక్తి-వంగర

మండలంలో అధికారిక లెక్కల ప్రకారంగా 548 ఎకరాలలో ఈ ఏడాది ఖరీఫ్‌లో మొక్కజొన్న పంటను రైతులు వేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మొక్కజొన్న పంట భారీగా దిగుబడి తగ్గింది. గత ఏడాది ఎకరాకు 25 క్వింటాల నుంచి 30 క్వింటాలు వరకు దిగుబడి వస్తే ఈ ఏడాది మాత్రం ఎకరాకు రెండు క్వింటాలు నుండి ఐదు క్వింటాలు రావడం కష్టంగా ఉందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం మొక్కజొన్న కోత దశకు చేరడంతో రైతులంతా పనులు ముమ్మరంగా చేస్తున్నారు. దిగుబడి పూర్తిగా లేకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. అప్పులు చేసి ఎన్నో మదుపులు పెట్టినా కనీసధర కూడా లేదని రైతులు వాపోతున్నారు.

వర్షాభావం..ఆపై కత్తెర పురుగు

ఖరీఫ్ సీజన్లో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని అధికారులు సూచించడంతో ఎక్కువ మంది రైతులు ఈ ఏడాది ఖరీఫ్ లో మొక్కజొన్న పంటను వేశారు. అయితే సక్రమంగా వర్షాలు కురవకపోవడం, చివరి దశలో కత్తెర పురుగు ప్రభావం అధికమవడం దిగుబడి తగ్గిపోయిందని పలువురు రైతులు తెలిపారు.



నీలయ్యవలసలో మొక్కజొన్న పనుల్లో రైతులు

దళారుల హవా

గ్రామాల్లో మొక్కజొన్న పంట పాత కోసి నూర్పు చేసి ఆరబెట్టి అమ్మకానికి రైతులు సిద్ధం చేస్తున్నారు. అయితే ఈ కొద్దిపాటి పంటను కూడా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ఇదే ఆదునుగా దళారులు తమకు నచ్చినంతకు కొనుగోలు చేసి దోచుకుంటున్నారు.

వ్యవసాయం కష్టమైంది



ఏడాది ఖరీఫ్ లో వేసిన మొక్కజొన్న పంట దిగుబడి లేకపోవడంతో తీవ్ర నష్టం జరిగింది. పంట సాగుకు చేసిన అప్పులు కూడా తీరేలా లేవు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– మాచర్ల రాంబాబు, రైతు, శివ్వాం

మదుపులు రావడం లేదు



ఎకరం పొలంలో మొక్కజొన్న వేసి రూ.15వేలు ఖర్చు చేశాను. ఐదు క్వింటాలు దిగుబడి వచ్చింది. దానిని అమ్మితే పదివేల రూపాయలకు వస్తుంది. పంటపై పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవడంతో చాలా బాధగా ఉంది.

– నివర్తి మోహనరావు, రైతు, చిన రాజులగుమ్మడ

దిగుబడి తగ్గడం వాస్తవమే



రైతులు ఈ ఏడాది ఖరీఫ్ లో వేసిన మొక్కజొన్న దిగుబడి తగ్గడం వాస్తవమే. ప్రభుత్వం తరపున కొనుగోలు చేసేందుకు మాకు ఎటువంటి అనుమతులు ఇంతవరకు లేవు. నష్టపరిహారం చెల్లించేందుకు కూడా మాకు ఎటువంటి ఆదేశాలు లేవు.

– టి.కన్నబాబు, ఎఒ, వంగర



సిరిమాను తరలింపు కార్యక్రమంలో పాల్గొన్న జనం

సిరిమాను చెట్టు తరలింపు

పైడితల్లమ్మ సంబరానికి పకడ్బందీ ఏర్పాట్లు : డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-నెల్లిమర్ల, విజయనగరంటౌన్

ఈనెల 30, 31తేదీల్లో జరిగే ఉత్తరాంధ్ర ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి సినిమానోత్సవానికి కావాల్సిన చింత చెట్టును నెల్లిమర్ల మండలం జరజాపుపేట తుమ్మి అప్పారావు కల్లం నుంచి తరలించే కార్యక్రమం ఆదివారం జరిగింది. సిరిమాను చెట్టుకు ముందుగా సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు ప్రజా ప్రతినిధులు , నేతలు చెట్టు నరికే ప్రక్రియను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి భక్త జనం పోటెత్తింది. ఈ సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్ర శేఖర్ , నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మెన్ కేసలి అప్పారావు, మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు, మాజీ ఎంపి బొత్స ఝాన్సీలక్ష్మి, నెల్లిమర్ల మున్సిపల్ ఉపాధ్యక్షులు సముద్రపు రామారావు, ఆలయ ఇఒ సుధారాణి, ప్రధాన పూజారి బంటుపల్లి వెంకట్రావు, ఆలయ కమిటీ సభ్యులు, పలువురు నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సిరిమానోత్సవానికి విస్తృత ఏర్పాట్లు : కోలగట్ల



గొడ్డలితో గాటు వేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చెప్పారు. భక్తులంతా అమ్మవారిని దర్శించుకునే విధంగా క్యూ లైన్లు ఏర్పాటు చేశామని, విఐపి పాసులు రద్దు చేశామని తెలిపారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పైడిమాంబ ఆశీస్సులు అందరికీ ఉండాలి

పైడితల్లి అమ్మవారి ఆశీస్సులు జిల్లా ప్రజలందరికీ ఉండాలని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. అమ్మవారి పండుగకు ఇతర రాష్ట్రాలనుంచి కూడా వేలాది మంది భక్తులు తరలి వస్తారని, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

నకిలీ పట్టాలపై సమగ్ర దర్యాప్తు చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇందిరమ్మ కాలనీలో నకిలీ ఇళ్ల పట్టాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు అధికారులను డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇందిరమ్మ కాలనీలో ప్రభుత్వ ఇళ్ల స్థలాలను కొంతమంది అక్రమార్కులు రాజకీయ అండతో కబ్జా చేసి కింద స్థాయి రెవెన్యూ ఉద్యోగుల సహకారంతో నకిలీ పట్టాలను తయారు చేసి విక్రయిస్తున్నారని తెలిపారు. ఇళ్ల స్థలాలు కబ్జా, నకిలీ పట్టాలపై గతంలో పోరాటం చేశామని, మీడియాలో కూడా పలు కథనాలు వచ్చాయని చెప్పారు. నకిలీ పట్టాలను గుర్తించేందుకు ఆర్‌డిఒ, తహశీల్దార్ విఆర్‌ఒలతో నాలుగు బృందాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా ఇందిరమ్మ కాలనీలో సమగ్ర దర్యాప్తు చేసి ఇళ్ల స్థలాలు కబ్జా, నకిలీ పట్టాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు కబ్జా చేసిన, నకిలీ పట్టాలకు సహకరించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం పాల్గొన్నారు.

18న మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని రాక

ప్రజాశక్తి-విజయనగరం

ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఈనెల 18న జిల్లాలో పర్యటించనున్నట్టు అకాడమీ కార్యదర్శి ఎం.బాలగంగాధర తిలక్ తెలిపారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు నగరానికి చేరుకొని పైడితల్లి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుంటారని పేర్కొన్నారు. 10 గంటలకు స్థానిక మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడతారని వెల్లడించారు. 11 గంటలకు రామతీర్థంలోని శ్రీరామస్వామి దేవస్థానం సందర్శిస్తారని తెలిపారు. అనంతరం శ్రీకాకుళం బయలుదేరి వెళ్లనున్నట్టు పేర్కొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గంటేడ గౌరునాయుడు, కవులు, రచయితలు

కథకు పుట్టినిల్లు ఉత్తరాంధ్ర

వెలుగువైపు కథా సంపుటి ఆవిష్కరణలో గంటేడ

ప్రజాశక్తి-విజయనగరం కోట

కథకు ఉత్తరాంధ్ర పుట్టినిల్లు అని ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరునాయుడు అన్నారు. ప్రముఖ రచయిత్రి ఇనుగంటి జానకి రచించిన 'వెలుగు వైపు' కథా సంపుటిని ఆదివారం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో స్థానిక గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంధాలయంలో గౌరునాయుడు తదితరులు ఆవిష్కరించారు. మల్లీ పురం జగదీష్ పుస్తక సమీక్ష చేశారు. అదేవిధంగా బాలల నాటికలు పుస్తకాన్ని కెవి శేషారావు ఆవిష్కరించగా, వీపు విజయ్ కుమార్ సమీక్షించారు. అనంతరం గంటేడ గౌరునాయుడు మాట్లాడుతూ కథకు తూర్పు దిక్కు ఉత్తరాంధ్ర అని అన్నారు. మిగతా ప్రాంతాలతో పోటీపడి మంచి కథలు రావాలని, నడుస్తున్న జీవితం కథలు వస్తే ఇంకా బాగుంటుందని అన్నారు. నేటి ప్రభుత్వాలు ఇస్తున్న సంక్షేమ పథకాలు రైతన్న గాథలుపై కథలు రావాలని ఆశించారు. కవి పాయల మురళీ కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రచయిత్రి ఇనుగంటి జానకిని ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్, రచయితలు పిఎస్ శ్రీనివాస్, చీకటి చంద్రిక రాణి, రెడ్డి శంకర్రావు, బాలకృష్ణ, చలం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని పలుచోట్ల దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బొండాడవీధిలోని మహాగణపతి కామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి ఆలయంలోను, తోటపాలెంలోని కోదండ రాముని ఆలయంలోను ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పదిరోజులు పాటు నిర్వహించే కార్యక్రమాలను జయప్రదం చేయాలని తోటపాలెం ఆలయ కమిటీ సభ్యులు ఆర్లె కృష్ణారావు, పతివాడ సత్యనారాయణ తదితరులు కోరారు. బొండాడవీధి కమిటీ అధ్యక్షులు అప్పలబత్తుల సోమరాజు మాట్లాడుతూ అక్టోబర్ 15వ తేదీ నుండి 24 వ తేదీ వరకు దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

38వ డివిజన్ దుప్పాడలో దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా దుర్గాదేవి విగ్రహాన్ని మేళాతాళాలు, పులివేషాలు, డప్పుల వాయిద్యాల మధ్య ఘనంగా ఊరేగించి అమ్మవారిని మండపంలో ప్రతిష్టించారు. కార్యక్రమంలో కొత్త దుప్పాడ దుర్గాదేవి ఆలయ కమిటీ ప్రతినిధులు, కార్పొరేటర్ తోగురోతు సంధ్యారాణి, మాజీ కౌన్సిలర్ బొబ్బాది త్రినాధరావు, కరణం రమణారావు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న జనం

'తెలగా'ను బిసి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి- భోగాపురం

ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్న తెలగా సామాజిక వర్గాన్ని బిసి జాబితాలోకి చేర్చాలని ఆ సామాజిక వర్గం నాయకుడు పల్లంట్ల వెంకట రామారావు అన్నారు. భోగాపురంలో తెలగ సామాజికవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో తెలగ సామజిక వర్గం చాల వెనుకబడి ఉందన్నారు. యువత కు సరైన ఉద్యోగాలు లేక వలస పోతున్నారని వెల్లడించారు. ఇక నుంచి ఉద్యమాన్ని తీవ్ర స్థాయికి తీసుకువెళ్లి బిసి రిజర్వేషన్ సాధించవరకు పోరాడాలని అన్నారు. దీనిలో భాగంగా ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకు పాదయాత్ర ప్రారంభిస్తున్నామని తెలిపారు. పార్టీలకు అతీతంగా తెలగ సామజిక వర్గ నాయకులు మద్దతు ఇవ్వాలని అన్నారు. అంతకుముందు తెలగ కులానికి వన్నె తెచ్చిన స్వర్గీయ కొమ్మూరు అప్పడుదొర, సంజీవరావులను స్మరిస్తూ మౌనం పాటించారు. సమావేశంలో తెలగ సామాజికవర్గం నాయకులు పెద్ది లక్ష్మి నారాయణ, లింగం సత్యనారాయణ, లోకం ప్రసాద్, కొమ్మూరు సుభాషణరావు, ఆళ్ల ఉదయబాబు, పడాల భాను, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, అడపా ప్రసాద్, తెలగ కులస్తులు పాల్గొన్నారు.



కలాం విగ్రహావిష్కరణలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, మేయర్ విజయలక్ష్మి

కలాం విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రపంచం గర్వించదగ్గ దార్శనికుడు మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం అని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కొనియాడారు. ఆదివారం అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని స్థానిక కస్పా హై స్కూల్లో కలాం విగ్రహాన్ని కోలగట్ల ఆవిష్కరించారు. 1987 సంవత్సరంలో కస్పా హైస్కూల్లో చదివిన పూర్వ విద్యార్థులు అబ్దుల్ కలాం విగ్రహాన్ని సమకూర్చారు. అనంతరం పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగం పురోభివృద్ధికి అబ్దుల్ కలాం చేసిన సేవలు ఎనలేనివని అన్నారు. శాస్త్రవేత్తగా ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చి ప్రపంచంలోనే వినూత్న ప్రయోగాలకు ఆద్యుడుగా నిలిచారని అన్నారు. భారత రాష్ట్రపతిగా ఆయన అందించిన సేవలు మరువరానివని గుర్తు చేశారు. కలాం ఆలోచనలు, చూపిన మార్గం భావితరాలకు అనుసరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం శంకర్రావు, స్థానిక కార్పొరేటర్ సయ్యద్ గౌస్, వైసిపి నాయకులు పిలకా శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థుల ప్రతినిధులు విశ్వనాద్, షబ్బీర్ అహ్మద్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం సేవలు మరువలేనివి

శాస్త్ర సాంకేతిక రంగాలలో భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అని జనసేన నాయకులు గురాన అయ్యలు కొనియాడారు. అబ్దుల్‌కలాం జయంతి వేడుకలు జనసేన కార్యాలయంలో ఆదివారం ఘనంగా జరిగాయి. కలాం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా అయ్యలు మాట్లాడుతూ భారత క్షిపణి పితామహుడు, రాష్ట్రపతి పదవికి వన్నె తెచ్చిన మహోన్నత వ్యక్తి ఎపిజె అబ్దుల్ కలాం అని కొనియాడారు. కార్యక్రమంలో రేగిడి లక్ష్మణరావు, రేవళ్ల పైడినాయుడు, వజ్రపు నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ అండ్ టెక్నాలజీని అభివృద్ధి పరచాలి

విజయనగరం కోట : విశ్వ విద్యాలయాల్లో సైన్స్ అండ్ టెక్నాలజీని అభివృద్ధి పరచాలని కోరిన వ్యక్తి మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం అని వక్ఫ్ బోర్డ్ మాజీ అధ్యక్షులు ఎ.కరీం అన్నారు. ఆదివారం కలాం జయంతిని పురస్కరించుకొని విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. కలాం చూపిన బాటలో విద్యార్థులు ముందుకు సాగాలని కోరారు.

త్వరలో మూడోవిడత భూసర్వే చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని ల్యాండ్స్ అండ్ సర్వే రికార్డ్స్ అధికారి టి.త్రివిక్రమరావు తెలిపారు. ఇప్పటికే రెండు దఫాలుగా చేపట్టిన సర్వేలో ఎలాంటి పొరపాట్లు, అనుమానాలకు తావులేకుండా ముగించామని స్పష్టం చేశారు. తొలుత గ్రామ కంఠాలు, ప్రభుత్వ స్థలాలు గుర్తించి, ఆ తరువాతే పాత రికార్డులు, పట్టాదారు పాసుపుస్తకాల ఆధారంగా ప్రైవేటు భూములను విభజిస్తున్నామని తెలిపారు. పనితీరులో విజయనగరం జిల్లా రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని, అందువల్లే ఇటీవల మూడు జిల్లాలకు చెందిన అధికారులు అధ్యయనం చేసేందుకు మన జిల్లాకు వచ్చారని గుర్తుచేశారు. సర్వే పూర్తికాగానే సంబంధిత మండల రెవెన్యూ అధికారులు పట్టాదారు పాసుపుస్తకాలు కూడా మంజూరు చేస్తున్నారని వివరించారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

– ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

యజమాని ఆధీనంలోవున్న భూములకు, రికార్డులకు తేడావుంటే పరిష్కారం ఎలా?.

సర్వే సమయంలో పక్కపక్కన ఉన్న భూముల యజమానులను కూడా పిలుస్తున్నాం. వారి సమక్షంలో ఆధునాతన సాంకేతిక పద్ధతుల ద్వారా కమతాల విస్తీర్ణాన్ని లెక్కించి పొందుపరుస్తున్నాం. ఎవరికైనా ఇబ్బందులు, సందేహాలు ఉంటే అక్కడికక్కడే నివృత్తి చేస్తున్నాం. అప్పటికీ సంతృప్తి చెందకపోతే అర్థమయ్యే విధంగా న్యాయం చేయడానికి గ్రామాల్లోనే తహశీల్దార్ ఆధ్వర్యాన మొబైల్ కోర్టులు కూడా ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటి వరకు ఏ ఒక్క గ్రామంలోను వివాదాలు తలెత్తలేదు. అక్కడక్కడా సందేహాలు ఏర్పడినప్పటికీ, వాటికి పరిష్కారం చూపి, యజమానుల సందేహాలను నివృత్తి చేస్తున్నాం. ఇవన్నీ పూర్తయిన తరువాతే సరిహద్దు రాళ్లు పాతుతున్నాం.



త్వరలో మూడో విడత భూసర్వే

- పొరపాట్లకు తావులేకుండా తొలి, మలిదశ పనులు
- తొలుత గుర్తించేది గ్రామ కంఠాలు, ప్రభుత్వ భూములే
- వెనువెంటనే పట్టాదారు పాసుపుస్తకాలు
- ప్రజాశక్తితో ల్యాండ్స్ అండ్ సర్వే రికార్డ్స్ అధికారి త్రివిక్రమరావు ముఖాముఖి

➡ ఇప్పటి వరకు ఎన్ని గ్రామాల్లో రీసర్వే పూర్తయింది?

జిల్లా వ్యాప్తంగా 983 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఇందులో మొదటి విడత 179 గ్రామాల్లో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్ష పేరిట ప్రభుత్వం తలపెట్టిన సమగ్ర భూసర్వే చేపట్టాం. విజయవంతం కావడంతో రెండో విడతలో మరో 198 గ్రామాల్లో సర్వే చేపట్టింది. ప్రస్తుతం మూడో విడతలో 160 గ్రామాల్లో సర్వే చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం.

➡ సర్వే చేపట్టే పద్ధతి ఎలా ఉంటుంది?


సర్వే ప్రక్రియలో భాగంగా తొలుత గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని డ్రోన్ ద్వారా భౌగోళిక సరిహద్దులను ధ్రువీకరిస్తున్నాం. దాని ఆధారంగా ముందుగా గ్రామ కంఠం, ప్రభుత్వ భూములు, చెరువులు, కొండలు, వాగులు వంటివి గుర్తిస్తున్నాం. ఆ తరువాత వ్యక్తులకు చెందిన భూ కమతాలను సర్వే నెంబర్ల ఆధారంగా సరిచేస్తున్నాం. ఇన్ని పద్ధతులు అవలంభించడం వల్ల ఒకరి భూమి, మరొకరి పేరున వెళ్లేందుగానీ, పొరపాట్లుగానీ జరిగేందుకు ఆస్కారమే ఉండదు.

➡ తాజా రికార్డులు, పాస్‌పుస్తకాల మంజూరుకు అనుసరిస్తున్న పద్ధతులు ఏమిటి?

సర్వే ప్రక్రియ పూర్తి అయిన తరువాత ఆ వివరాలు తొలుత విలేజ్ సర్వేయర్ లాగిన్, ఆ తరువాత విఆర్‌ఒ, డిప్యూటీ తహశీల్దార్, తహశీల్దార్, ఆర్‌డిఒలకు వెళ్తాయి. అక్కడి నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వెళ్లిన తరువాత ఆర్‌ఒఆర్ (రికార్డ్ ఆఫ్ రైట్స్) తయారవుతుంది. ఆ వెంటనే భూమి యజమానులకు రెవెన్యూ అధికారులు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్నారు.

➡ సర్వే ఎప్పటిలోగా పూర్తికావచ్చు?

అది ఇప్పుడే చెప్పలేం. కానీ, ప్రస్తుతం సర్వే ప్రక్రియ వేగవంతమవుతోంది. తొలివిడత సిబ్బందికిగానీ, భూ యజమానులకు గాని ఎన్నో సందేహాలు, సమస్యలు ముందుకు వచ్చాయి. సాంకేతిక సమస్యలు కూడా ఉత్పన్నమయ్యాయి. వాటన్నింటినీ అధిగమించి సర్వే పూర్తిచేసేందుకు సుమారు ఏడాది సమయం పట్టింది. ఆ అనుభవాలు ఉపయోగించుకుని రెండో విడత కేవలం మూడు నెలల్లో పూర్తిచేశాం. మూడో విడతగానీ, ఆ తరువాతగానీ సర్వే పనులు మరింత వేగవంతంగా ముందుకు సాగుతాయని భావిస్తున్నాం.



➡ మన జిల్లాలో అధ్యయనానికి ఎవరు వచ్చారు?

రాష్ట్రంలో అన్ని జిల్లాల కన్నా వేగంగా సర్వే పనులు ముందుకు సాగుతున్న జిల్లా కూడా మనదే. అందుకే మన జిల్లాలోని అనుభవాలను, పనితీరును ఆకలింప జేసుకునేందు తిరుపతి, నెల్లూరు, అనంతపురం జిల్లాల జాయింట్ కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు రెండు నెలల క్రితం వచ్చారు. జిల్లాలో సర్వే చేపట్టేందుకు అనుగుణంగానే సిబ్బంది ఉన్నారు. సాంకేతిక పరికరాలు కూడా తగినన్ని ఉన్నాయి.

నాలుగున్నరేళ్ల పాలనలో.. తీరని రోజువారీ కష్టాలు


రోడ్డుపైనే కూరగాయలు విక్రయించడంతో ఇరుకుగా తయారైన రహదారి

- ప్రశ్నార్థకంగా జామి మార్కెట్ సమస్య
- గంటల తరబడి వాహనాల రద్దీ
- నరకయాతన అనుభవిస్తున్న విద్యార్థులు, ప్రజలు

ప్రజాశక్తి - జామి

'మాకు అధికారం వస్తే... సమస్యను ఇట్టే పరిష్కరిస్తా'మని ప్రగల్భాలు పలికే ఏలికలు.. అందలం ఎక్కాక, సమస్యను పట్టించుకోకపోవడం ఆనవాయితీగా మారింది. మండల కేంద్రమైన జామి మేజర్ పంచాయతీలో రోజూవారీ మార్కెట్‌ను పరిశీలిస్తే... ఆ మాట నిజమే అనేక తప్పదు. రోజువారీ మార్కెట్ కష్టాలు జనాన్ని ముప్పతిప్పలు పెడుతున్నాయి. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఆ రహదారి గుండా వెళ్లాలంటే, నరకయాతన పడాల్సిందే. మార్కెట్ నిర్వహణకు స్థలం లేక నడి రోడ్డుపైనే మార్కెట్ నిర్వహణతోనే సమస్య. ప్రతిరోజూ ఉదయం జామి-ఎస్.కోట రహదారి ప్రయాణమంటేనే భయపడాల్సిన పరిస్థితి. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ఆఫీసులు వెళ్లే ఉద్యోగులు, వాహన చోదకులు అష్టకష్టాలు పడుతున్న పరిస్థితి. ఇంత జరుగుతున్నా పంచాయతీ అధికారులు, పాలకవర్గం పట్టించుకోని దుస్థితి. పోనీ పోలీసులైన ట్రాఫిక్ నియంత్రణ చేస్తారంటే... వారిది మూణ్నాళ్ల ముచ్చటే. ఇలా వైసిపి అధికారం చేపట్టి దాదాపు నాలుగున్నరేళ్లు పూర్తికావస్తున్నా... సమస్య పరిష్కారం కాలేదు. గతంలో వారపు సంత స్థలాన్ని అభివృద్ధి చేసి, మార్కెట్ నిర్వహణ మారుస్తామని ప్రణాళికలు రూపొందించినా... అవి మాటలకే పరిమితమయ్యాయి.

జామి మేజరు పంచాయతీ ఆధ్వర్యంలో రోజువారి మార్కెట్ నిర్వహణ సాగుతోంది. ప్రతి ఏటా పంచాయతీ వేలం ధ్వారా కాంట్రాక్టరును ఎంపిక చేసి, మార్కెట్ నిర్వహణ చేపడుతున్నారు. తద్వారా పంచాయతీకి ఆదాయం వస్తుంది. అయితే ఇక్కడ మార్కెట్ నిర్వహణకు పంచాయతీ స్థలం చూపించాలి. కానీ పంచాయతీ స్థలం కేటాయించక పోవడంతో కాంట్రాక్టరు రహదారిపైనే మార్కెట్ నిర్వహిస్తున్నారు. ధీంతో రోజూ ఉదయం 7 నుంచి 9 గంటల వరకు రహదారిపై తీవ్ర ట్రాఫిక్ అంతరాయంతో జనం నానా ఇక్కట్లు పడుతున్నారు. ఆర్‌టిసి బస్సులు సైతం గంటల తరబడి నిలిచిపోవాల్సిన పరిస్థితి. ఇటీవల విశాఖ జిల్లా సబ్బవరం నుంచి రాయపూర్ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భారీ వాహనాలు ఎక్కువైన నేపథ్యంలో ట్రాఫిక్ అంతరాయానికి ఇక అంతేలేని పరిస్థితి.

పట్టించుకోని పంచాయతీ

ప్రతి ఏటా మార్చిలో రోజువారి మార్కెట్‌కు పంచాయతీ వేలం వేసి, నిర్వహణ బాధ్యత అప్పగిస్తారు. గతంలో జామి గ్రామానికి చెందిన న్యాయవాది బూసర్ల రమణారావు ఆధ్వర్యంలో కొంతమంది గ్రామస్తులు పంచాయతీ అధికారులతోపాటు ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డికి వినతి పత్రాలు అందజేసి, మార్కెట్ నిర్వహణకు తగిన స్థలాన్ని కేటాయించి, సమస్యను పరిష్కరించాలని కోరారు. అప్పట్లో ఎంపిడిఒ సతీష్ కూడా స్పందించి, మార్కెట్ స్థలం మార్పుపై తక్షణమే చర్యలు తీసికోవాలని ఆదేశించారు. దీంతో పంచాయతీ ఇఒ గ్రామంలోని సంత ప్రాంగణం శుభ్రం చేసి, మార్కెట్ మార్పు చేస్తామని కొద్ది రోజులు హడావుడి చేసి, చేతులు దులుపుకున్న పరిస్థితి. అనంతరం పత్రికల్లో కథనాలు రావడంతో ఎంపిపి, జెడ్‌పిటిసి సభ్యులు స్పందించారు. మండల, జిల్లా పరిషత్తు ఉమ్మడి నిధులతో వారపు సంత అభివృద్ధి చేస్తామని చెప్పారు. దీంతో సమస్యకు శాశ్వత పరిష్కారం వస్తుందని ప్రజలు భావించారు. కానీ అది కార్యరూపం దాల్చలేదు. అప్పటి నుంచి రోజూ కష్టాలు తప్పడం లేదు.

పంచాయతీదే బాధ్యత

వాస్తవానికి రోడ్డుపై అర నిమిషం అంతరాయం ఏర్పడినా, పోలీసులు అక్కడకు చేరుకుని సమస్య పరిష్కరిస్తారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజా సంఘాలు ఆందోళన చేసినప్పుడు పోలీసులు పది నిమిషాలు కూడా సమయం ఇవ్వకుండా అడ్డుకుని రోడ్డు క్లియర్ చేస్తారు. కానీ జామి రోజువారి మార్కెట్‌తో రహదారి నిర్బంధం జరిగినా పోలీసులు చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. వాస్తవానికి రోజూవారీ మార్కెట్ వల్ల ఆదాయం పొందుతున్న పంచాయతీ బాధ్యత వహించాలి. కానీ వారికి ఈ సమస్య పట్టడం లేదు. ఈ నేపథ్యంలోనే జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి ప్రమాదం జరిగినా దానికి పంచాయతీ పెద్దలు, అధికారులు బాధ్యత వహించక తప్పదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మార్కెట్ సమస్య పరిష్కారంతోపాటు అప్పటి వరకు ట్రాఫిక్ నియంత్రణ చేయించాల్సిన బాధ్యత పంచాయతీనే తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


అధ్వానంగా తయారైన పార్కు

ఆహ్లాదం కరువు

పచ్చని చెట్లు తొలగించడంతో కళ తప్పిన పార్కు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శృంగవరపుకోట పట్టణ ప్రజలకు ఆహ్లాదం కరువైందని చెప్పాలి. మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారికి కాసేపు సేద తీరేందుకు దశాబ్దాలుగా పట్టణ నడిబొడ్డున దేవి కూడలి పక్కనే ఉన్న గాంధీ పార్కే నిలయం. ఈ పార్కును గత ప్రభుత్వంలో కొంత అభివృద్ధి చేసినప్పటికీ సిమెంట్ బెంచీలను పాత వాటిని కొనసాగించారు. దీంతో అవి పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ఇప్పుడున్న మేజర్ పంచాయతీ అధికారులు పార్కులో చెట్లను, బెంచీలను పూర్తిగా తొలగించారు. నెలలు గడుస్తున్నా పార్కును అభివృద్ధి చేయడాన్ని విస్మరించారు. పార్కులోకి వెళ్లే దారిని చుట్టుపక్కల వ్యాపారులు ఆక్రమించారు. దీంతో పార్కు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఇప్పటికైనా పార్కులో పూలమొక్కలను పెంచి, బెంచీలు, ఆటవస్తువులు ఏర్పాటు చేయాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

పార్కును పునరుద్ధరించాలి

ఏదైనా పనిమీద పట్టణానికి వచ్చినప్పుడు మేజర్ పంచాయతీకి చెందిన గాంధీ పార్కులో కొంతసేపు సేదదీరేవాడిని. ప్రస్తుతం పార్కు చుట్టూ ఉన్న పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. ప్రస్తుతం పార్కు నిర్వాహణ ఊసే లేదు. పార్కును పునరుద్ధరించి సేద తీరేందుకు సౌకర్యాలు కల్పించాలి.

- అందం రామారావు, ధర్మవరం గ్రామం

ఆకట్టుకునేలా పార్కు సుందరీకరణ

గాంధీ పార్కులో సేదదీరేందుకు వచ్చినవారిని ఆకట్టుకునేలా అభివృద్ధి చేస్తాం. పార్కు సుందరీకరణలో భాగంగా చుట్టూ ప్లాంటేషన్, కొత్తరకం పూల మొక్కలతో ఆహ్లాదకరంగా తయారు చేస్తాం. సుందరీకరణకు సుమారు రూ.పది లక్షలు ఖర్చవుతుంది. కొంతమంది దాతలు ముందుకు వస్తున్నారు. దాతలు ఇచ్చే విరాళాలతో పంచాయతీ నిధులను కలిపి పార్కును అభివృద్ధి చేస్తాం. దసరా పండగ తర్వాత పనులు ప్రారంభిస్తాం.

- సిహెచ్ కన్నబాబు, ఇఒ, శృంగవరపుకోట మేజరు పంచాయతీ



రమణను సత్కరిస్తున్న పిటిసి ప్రిన్సిపల్ ఆనందబాబు

రమణ సేవలు స్ఫూర్తిదాయకం

పిటిసి ప్రిన్సిపల్ ఆనందబాబు

ప్రజాశక్తి-విజయనగరం

యువత దేశ రక్షణ రంగంలో భాగస్వామ్యం అయ్యేలా, వారు ఆర్మీలో చేరేందుకు అన్ని విధాలుగా సంసిద్ధులుగా తయారు చేయిస్తున్న ఇండియన్ ఆర్మీ కాలింగ్ డైరెక్టర్ బి.వి రమణ సేవలు ఎందరికో స్ఫూర్తిదాయకమని పోలీసు ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌పిటి ఆనందబాబు కొనియాడారు. మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్ జయంతిని పురస్కరించుకొని మాతృదేవోభవ స్వచ్ఛంద సంస్థ, ఎన్‌విఎన్ బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల విడుదల అయిన అగ్నిపథ్ ఫలితాల్లో ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థకు చెందిన 82 మంది ఎంపిక కావడంతో వారికి శిక్షణ అందించిన రమణను సత్కరించారు. దేశం పట్ల ప్రేమ అభిమానాలతో చిన్నవయసులో ఎందరో యువతలో దేశభక్తిని రగిలించి వారు ఇండియన్ ఆర్మీ వైపు వెళ్లేలా కృషి చేస్తున్న బి.వి రమణ సేవలు శ్లాఘనీయమని కొనియాడారు. విజయనగరం సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ మజ్జి కృష్ణారావు, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు బీశెట్టి బాబ్జి, మాజీ ఎన్ఎస్‌జి అనీల్ తదితరులు ఆయన్ను అభినందించారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

విజయనగరం : సత్యా విద్యా సంస్థల ఎన్‌సిసి ద్వారా ఎస్ఎస్ మీల్స్ ప్లేట్లు, ఎస్ఎస్ వాటర్ గ్లాసులు, పండ్లు, రొట్టెలు ప్రేమ సమాజం వృద్ధాశ్రమంలో వద్దులకు ధీరాసంస్థ సహకారంతో ఉచితంగా పంపిణీ చేశారు. ధీర సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ బొత్స సందీప్, బొత్స పూజిత సత్యా కళాశాలల ఎన్‌సిసి క్యాడెట్లు చురుకుగా పాల్గొని ప్రేమసమాజంలో వృద్ధులతో మాట్లాడారు. వారి అవసరాలు, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునే ప్రయత్నం చేశారు. కార్యక్రమంలో 2(ఎ) బాలికల ఎన్‌సిసి సిబ్బంది సుబేదార్ మేజర్ రామ్‌దత్, ఎన్‌సిసి అధికారులు లెఫ్టినెంట్ ఎస్.ప్రశాంత్, సిఎస్ఒ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

న్యాయానికి సంకెళ్లా?

టిడిపి వినూత్న నిరసన

ప్రజాశక్తి-విజయనగరంకోట

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టు నిరసిస్తూ ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు వినూత్న కార్యక్రమం చేపట్టారు. న్యాయానికి సంకెళ్లు పేరిట నిరసనలతో హోరెత్తించారు. చేతికి తాళ్లు, రిబ్బన్లతో సంకెళ్లు వేసుకొని ఆదివారం రాత్రి 7గంటల నుంచి 7.0 5గంటల వరకు నిరసన తెలిపారు. టిడిపి జిల్లా కార్యాలయం అశోక్‌బంగ్లా వద్ద నాయకులు, కార్యకర్తలు సంకెళ్లు వేసుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి ఐవిపి రాజు మాట్లాడుతూ చట్టానికి కళ్లు లేవు అన్నట్లు ఈరాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. 37 రోజులుగా చంద్రబాబును జైల్లో పెట్టి కాలయాపన చేసి ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబుకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలి నాయుడు, వేచలపు శ్రీనివాసరావు, కార్యాలయ కార్యదర్శి వర్మ రాజు, విజ్జపు ప్రసాద్, రొంగల రామారావు, భాష, మహేష్, విజయనగరం నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. కోరుకొండలో జనసేన నాయకులు గురాన అయ్యలు ఆధ్వర్యాన న్యాయానికి సంకెళ్లు కార్యక్రమం నిర్వహించారు. చంద్రన్నకు అండగా రైతన్నలు కార్యక్రమాన్ని టిడిపి సీనియర్ నాయకులు గణపతినీడి శ్రీనివాసరావు ఆధ్వర్యాన నిర్వహించారు. టిడిపి పార్లమెంటరీ అధ్యక్షులు కిమిడి నాగార్జున, లోక్‌సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ, మాజీ మంత్రి పడాల అరుణ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు పి.కామేశ్వరరావు మాట్లాడారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, జిల్లా న్యాయవిభాగం అధ్యక్షులు ఉపాధ్యాయుల రవిశంకర్, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పురం అప్పారావు, గేదెల ఆదిబాబు, మైలిపల్లి పైడిరాజు, తుంపిల్లి రమణ, గొలగాని సురేంద్ర తదిరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా కోటలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన చేతులకు తాడుతో సంకెళ్లు వేసుకొని నిరసన తెలిపారు. చంద్రబాబు ధర్మ పోరాటానికి మద్దతు తెలుపుతూ ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు.


విజయనగరంకోట.. చేతులకు సంకెళ్లతో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

బాడంగి : బాడంగిలో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు ఆధ్వర్యాన చేతులకు తాడుతో సంకెళ్లు వేసుకుని నిరసన చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : న్యాయానికి సంకెళ్లు వేసిన పిచ్చి జగన్ నియంతృత్వ పోకడలను దేశమంతా తెలియజెప్పాలని టిడిపి నాయకులు అన్నారు. నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో చేతులకు రిబ్బను కట్టుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ సీనియర్ నాయకులు సువ్వాడ రవి శేఖర్, మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, నగర పంచాయతీ పార్టీ అధ్యక్షులు బైరెడ్డి లీలావతి , పార్లమెంట్ కార్యదర్శి లెంకఅప్పలనాయుడు, అట్టాడ శ్రీధర్ పాల్గొన్నారు.

బొబ్బిలి : పైశాచిక ఆనందం కోసం టిడిపి అధినేత చంద్రబాబును వైసిపి ప్రభుత్వం అరెస్టు చేసిందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన అన్నారు. కోటలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అన్యాయంగా అరెస్టు అయిన చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, లోకేష్, బ్రాహ్మణి, బాలకృష్ణను మాజీ ఎమ్మెల్యే తెంటు రాజాతో కలిసి సంఘీభావం తెలిపామన్నారు. చంద్రబాబును అన్యాయంగా, రాజ్యాంగ, ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడిచి అరెస్టు చేశారన్నారు.

గరివిడి : టిడిపి అధినేత చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎవరికీ హాని తలపెట్టలేదని టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున తెలిపారు. ఆదివారం చీపురుపల్లిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ చంద్రబాబును జైల్లోనే ఉంచాలని కుటుంబ సభ్యులు కోరుకుంటున్నట్లు మంత్రి బొత్స అనడం తగదన్నారు. బొత్స కుటుంబ సభ్యులు అలానే అనుకుంటారా? అని నిలదీశారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు రౌతు, రెస్కో మాజీ చైర్మన్ దన్నాన రామచంద్రుడు, తాడ్డే సన్యాసినాయుడు, ముల్లు రమణ,గనపతి శ్రీనివాస రావు, గవిడి నాగరాజు, రౌతు నారాయణ రావు పాల్గొన్నారు.

వేపాడ: పాలనలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు అన్నారు. వేపాడలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాధనంతో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు చేసి, సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. నాలుగేళ్లు గడిచినా నేటికీ అతీగతీ లేకుండా పోయిందన్నారు. సగానికి పైగా రైతు బజార్ కేంద్రాల పనులు పూర్తి కాలేదన్నారు. వెల్‌నెస్ సెంటర్లకు నిధులు మంజూరు చేయకపోవడంతో నేటికీ పురోగతి సాధించలేదన్నారు. పూర్తిస్థాయిలో రైతులకు అవసరమైన ఎరువులను అందించలేదని చెప్పారు.

కలాం సేవలు నిరుపమానం

ప్రజాశక్తి-రామభద్రపురం

భారతరత్న, నిస్వార్ధ సేవా తత్పరులుగా పేరుగాంచిన అబ్దుల్ కలాం సేవలు నిరుపమానమని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కలాం 94వ జయంతిని విద్యార్థుల దినోత్సవంగా రోటరీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజు మాట్లాడుతూ క్షిపణి శాస్త్రవేత్తగా శాస్త్ర సాంకేతిక రంగాలలో సేవలందించారని కొనియాడారు. ఆయన జీవితంలో అధిక భాగం విద్యార్థుల విద్యా పురోభివృద్ధికి, సాంకేతిక ప్రగతికి వినియోగించారని తెలిపారు.

గుర్ల : స్థానిక శాఖా గ్రంథాలయంలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఎఎస్ఐ బి.కామేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గుడ్డ సంచులను పంపిణీ చేశారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు దాహర్తి తీర్చుటకు వాటర్ కేన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డి.ఈశ్వరరావు, గ్రంథాలయాధికారి రామారావ పాల్గొన్నారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే

ప్రజాశక్తి-బొబ్బిలి

మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని ఎన్ఆర్ఐ హాస్పిటల్ రెసిడెంట్ డాక్టర్ రమాదేవి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్ఆర్ఐ హాస్పిటల్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ చేతులు శుభ్రపరచుకొనే దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గోడ పత్రికను ప్రదర్శించారు. చేతి రుమాళ్ళు, సబ్బులు పంపిణీ చేశారు. అనంతరం రమాదేవి మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల మేరకు 80శాతం జబ్బులు చేతులు శుభ్రత లేకపోవటం వల్ల వస్తున్నాయని, మన ఆరోగ్యకరమైన భవిష్యత్ మన చేతుల్లోనే ఉందని అన్నారు. రోటరీ అధ్యక్షులు జె సి రాజు మాట్లాడుతూ చేతులు శుభ్రపరచుకొనే పద్ధతిని వివరించారు. అంతర్జాతీయ రోటరీ సంస్థ చేతుల శుభ్రతపై విస్తత కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ ఆస్పత్రి సిఇఒ ఎస్.శ్రీనివాసన్, కార్యదర్శి శ్రీ హరి, డాక్టర్ రేణుక, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో డి.కొల్లాం

ప్రజాశక్తి-దెంకాడ

మండలంలోని డి.కొల్లం పంచాయతీ అభివృద్ధి పథంలో సాగుతోంది. సర్పంచ్ అట్టాడ శివకృష్ణ పంచాయతీ నిధులతో పాటు మండల, జిల్లా పరిషత్తు, ఎమ్మెల్యే నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఈ పంచాయతీ పరిధిలో డి.కొల్లాంతోపాటు కె.కొల్లాం, రెడ్డికపేట, ఆర్.ముంగినాపల్లి గ్రామాలు ఉన్నాయి. మొన్నటి వరకు ఆయా గ్రామాల్లో సిసి రోడ్లు గాని, కాలువలు గాని లేకపోవడంతో గ్రామాల్లో వర్షపు నీరు, వాడుకనీరు నిల్వ ఉండిపోయేవి. దీంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతుండేవారు. కె.కొల్లాం గ్రామంలోకి వెళ్లడానికి ముందు చెరువుగట్టు ఉండేది. ఆ గట్టుపై నుంచి మట్టి రోడ్డు ద్వారా గ్రామంలోకి వెళుతుండేవారు. చెరువు నిండినా, వర్షం పడినా గ్రామానికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతుండేవారు. సర్పంచ్ ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన నాబార్డు నిధులు రూ.33 లక్షలు విడుదల చేయించి చెరువుగట్టుకు ఇరువైపులా రక్షణగోడ, గ్రామంలోకి వెళ్లడానికి సిసి రోడ్డు ఏర్పాటు చేశారు. తమ చిరకాల వాంఛ నెరవేరడంతో గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కె.కొల్లాంలో యాతపేటలో రూ.2.50 లక్షలతో స్టేజ్ ఏర్పాటు చేశారు. మరో రెండు లక్షల రూపాయలతో సిసి కాలువలు వేశారు. డి.కొల్లాం గ్రామంలో గడపగడపకు నిధులు సుమారు ఏడు లక్షల రూపాయలతో సిసి కాలువలు నిర్మించారు. ఆర్.ముంగినాపల్లి, రెడ్డికపేటలో మరో రూ.7.80 లక్షలతో సిసి కాలువలు ఏర్పాటుచేశారు.


కాలువ పనులు చేపడుతున్న కార్మికులు

సర్పంచ్ శివకృష్ణ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఉన్న నాలుగు గ్రామాల్లోనూ సిసి కాలువలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సిసి రోడ్లపైనా దృష్టిపెట్టామని, అవసరం ఉన్న చోట నిర్మిస్తున్నామని తెలిపారు. పంచాయతీ అభివృద్ధికి సహకరించిన ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు, ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవ రావు, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల్లో జనసేన నాయకుల పర్యటన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని మల్యాడ, ఒమ్మి, ముల్లుపేట గ్రామాల్లో జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు లోకం మాధవి ఆధ్వర్యాన ఆదివారం జనసైనికులు పర్యటించారు. రైతులు, కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మల్యాడ గ్రామంలో అప్పులు చేసి మరీ పంటలు పండిస్తున్నామని, కానీ సరైన గిట్టుబాటు ధరలు రాకపోగా ఇబ్బంది పడుతున్నామని రైతులు చెప్పారు. ఒమ్మి గ్రామంలో దళితులను కలవగా వారికి ప్రభుత్వం కేటాయించిన డి పట్టా భూములు వివాదాల్లో ఉన్నట్టు తెలిపారు. అనంతరం జనసేన నాయకులు లోకం ప్రసాద్ మాట్లాడుతూ రైతుల సమస్యలు ప్రభుత్వానికి, యంత్రాంగానికి కనపడటం లేదా? అని ప్రశ్నించారు. సోమవారం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

17న సింగుబాబు జయంతి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జెడ్‌పిటిసి మాజీ సభ్యులు దంతులూరి శంకర సీతారామరాజు (సింగుబాబు) 73వ జయంతి వేడుకలను ఈ నెల 17న నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం మండలంలోని కొండవెలగాడ గ్రామంలో వారు విలేకరులతో మాట్లాడారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో సింగుబాబు జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తామన్నారు. స్వచ్ఛందంగా రక్తదాన శిబిరంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు దంతలూరి అజయ్‌బాబు, ఆర్యవర్మ, టిడిపి నాయకులు మొయిద సీతంనాయుడు, మొయిద సత్యనారాయణ, అట్టాడ చినపైడితల్లి, చల్లా రాము, బొంతు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కలు నాటాలి

ప్రజాశక్తి -విజయనగరం కోట

మానవాళి మనుగడ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్‌కుమార్ అన్నారు. ఆదివారం నాడు స్థానిక కాంగ్రెస్ కార్యాలయం ఆవరణలో కాంగ్రెస్ నాయకులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించడం ద్వారా వాతావరణంలో కాలుష్యాన్ని తగ్గించి మానవళి మనుగడకు, సమాజ శ్రేయస్సుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సతీష్ కుమార్, నాయుకులు ఎ.కరీమ్ , జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పూడి శ్రీనివాసరావు , రాష్ట్ర మైనారిటీ వైస్ చైర్మన్ షరీఫ్ ,బొబ్బిలి కో అర్డినేషన్ సభ్యులు ముగడ వెంకట రమణ , ముప్వల శ్రీనివాసరావు, గడి బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.